తేదీ 13.05.2006, బుద్ధపూర్ణిమ, బృందావనం

# స్థిరత్వం, ఏకత్వం రెండూ ఉన్నప్పడే మానవత్వానికి సార్థకత

సర్వరూప ధరం శాంతం సర్వనామ ధరం శివం
సచ్చిదానంద మద్వైతం సత్యం శివం సుందరం

**ప్రేమస్వరూపులారా!** బుద్ధపూర్ణిమనాడు బుద్ధుని గురించి, పూర్ణిమగురించి చెప్పుకుంటే సరిపోదు. బుద్ధుని ఆదర్శముగురించి, మానవాళికి అతడు అందించిన సందేశముగురించి విచారణ చేయాలి.

శుద్ధోధనునికి ఇరువురు భార్యలు. మొదటి భార్య మాయాదేవి, రెండవ భార్య గౌతమి. సంతానప్రాప్తి నిమిత్తమై ఆ దంపతులు ఎంతో కాలముపాటు అనేక వ్రతములు, జపములు, తపములు, యజ్ఞములు, యాగములు ఎన్నియో చేస్తూ వచ్చారు. "నా తరువాత ఈ రాజ్యము నేలగలవారెవరు?" అన్న యోచనతో శుద్ధోధనునికి రాత్రింబవళ్ళు మనశ్శాంతి కరువైంది. అతడనేకమంది జ్యోతిశ్శాస్త్రవేత్తలను సంప్రదించాడు. తప్పక సంతానం కలుగుతుందని వాళ్ళు చెప్పిన మాటలను విని కొంత సంతృప్తి చెందుతూ వచ్చాడు. ఈవిధంగా కొంతకాలం గడచిన తరువాత ఎట్టకేలకు ఆ దంపతుల మనోభీష్టము నెరవేరింది. మాయాదేవి గర్భము దాల్చింది. నవమాసములు నిండిన తరువాత ఆమె లుంబినీ అనే ప్రదేశంలో పండంటి మగబిడ్డను ప్రసవించింది. ఆ పిల్లవానికి సిద్ధార్థుడు అని నామకరణం చేశారు. కాని, దురదృష్టవశాత్తు ప్రసవమైన కొన్ని దినములలోనే మాయాదేవి తన దేహమును వదలిపెట్టింది. శుద్ధోధనుని రెండవ భార్య గౌతమి ఆ పిల్లవానిని తన స్వంతకుమారునిగా భావించి, అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసింది. అందుచే ఆ పిల్లవానిని గౌతముడనికూడా పిలుస్తూ వచ్చారు.

sri sathyasai vachanamrutam

శుద్ధోధనుడు సిద్ధార్థుని జాతకమును దైవజ్ఞులకు చూపించగా వాళ్ళు ఇతను రాజ్యమునేలడని, మధ్యలో రాజ్యమును వదలిపెట్టి సన్యాసము స్వీకరిస్తాడని జోస్యం చెప్పారు. వాళ్ళ మాటలు శుద్ధోధనుని చెవుల్లో రింగుమంటూనే ఉన్నాయి. ఏ పిల్లలతో చేరితే తన కుమారుని మనస్సు ఏవిధంగా మారిపోతుందో అనే భయముచేత అతనిని రాజప్రాసాదమునుండి బయటకు పంపకుండా, ఎక్కడా ఎవరితోనూ చేర్చకుండా జాగ్రత్త వహిస్తూ వచ్చాడు. ఈవిధంగా ఇరవై సంవత్సరాలు సిద్ధార్థుని కాపాడుతూ వచ్చాడు. ఆ తరువాత సిద్ధార్థునికి యశోధర అనే కన్యతో కల్యాణం జరిగింది. సంవత్సరం తరువాత వారికొక కుమారుడు కలిగాడు. అతనికి రాహులుడు అని పేరు పెట్టారు. కుమారుని చూసుకొని ఇరువురూ ఎంతో ఆనందంగా కాలం గడుపుతూ వచ్చారు.

**సిద్ధార్థుని సత్యాన్వేషణ**

ఒక రోజు సిద్ధార్థుడు రాజప్రాసాదం వెలుపలకు వచ్చినప్పుడు రోగపీడితుడైన ఒక వ్యక్తిని, ఒక వృద్ధుని, ఒక మృత దేహాన్ని చూసి తీవ్రమైన అశాంతికి గురి అయినాడు. ఒకనాటి రాత్రి ఉన్నట్లుండి అతని మనస్సు మారిపోయింది. అర్ధరాత్రివేళ భార్యకు తెలియకుండా లేచి, తన కుమారుని ముద్దాడి, రాజప్రాసాదాన్ని విడిచిపెట్టి అరణ్యానికి వెళ్ళిపోయాడు. సిద్ధార్థుని జాతకాన్ని చూసి జ్యోతిష్కులు చెప్పిన మాట నిజమైంది. అరణ్యంలో అతడు అనేక బాధల ననుభవించవలసివచ్చింది; ఎన్నో కష్టములకు గురికావలసివచ్చింది. ఆత్మసాక్షాత్కార మార్గంలో అతనికి అనేక అవరోధాలు ఎదురైనాయి. వాటినన్నింటినీ భరించుకొని, సహించుకొని మనస్సును గట్టిపరచుకున్నాడు. అరణ్యంలో అతనికి ఒక ముని తారసపడి, 'నాయనా! నీవనుభవిస్తున్న మనోవ్యథ నివారణ కావడానికి నీకొక రక్ష ఇస్తాను. దానిని నీవు మెడలో కట్టుకో', అని చెప్పాడు. (స్వామి తమ దివ్య హస్తచాలనముచే ఆ రక్షను సృష్టించి భక్తులకు చూపించారు). దానిని మెడలో కట్టుకున్న తరువాత అతనికి దుఃఖ నివృత్తి కలిగింది. ఆ తరువాత తపస్సు ప్రారంభించాడు. తపస్సు సుదీర్ఘంగా సాగింది. 'నేనెవరు? నేనెవరు? నేనెవరు?' ఇదే అతను వేసుకున్న ప్రశ్న. 'దేహము నేనా? మనస్సు నేనా? బుద్ధి నేనా? చిత్తము నేనా?' అని ప్రశ్నించుకున్నాడు.

srisathyasaivachanamrutam

ఇవేవీ తాను కాదని గుర్తించాడు. చివరికి, 'నేను నేనుగానే ఉన్నాను', అనే తత్త్వానికి వచ్చాడు. కట్టకడపటివరకు ఈ రక్ష బుద్ధుని మెడలో ఉండినది. తాను దేహమును వదలిపెట్టిన తరువాత ఈ రక్ష కూడా అంతర్ధానమైపోయింది.

**'నేను నేనే' అనుకోవడమే నిజమైన ధ్యానము**

వేదము 'అహం బ్రహ్మాస్మి', 'తత్త్వమసి' అనే మహావాక్యములను బోధిస్తున్నది. 'అహం బ్రహ్మాస్మి' అంటే 'నేను బ్రహ్మను'. ఈ మహావాక్యములో 'నేను', బ్రహ్మ' అనేవి రెండు చేరివున్నాయి. రెండుగా ఉన్నది సత్యము కాదు. 'తత్త్వమసి' అనగా 'అది నేనే'. ఇందులో కూడా 'అది', 'నేను' అనేవి చేరివున్నాయి. కాబట్టి, ఇదికూడా జ్ఞానము కాదు. 'అద్వైత దర్శనం జ్ఞానం'. సిద్ధార్థుడు ఈవిధంగా విచారణ చేస్తూ కట్టకడపటికి 'నేను నేనే' అనే సత్యాన్ని తెలుసుకున్నాడు. అదియే నిజమైన సాక్షాత్కారము. అది తెలుసుకోకుండా ఎంత తపస్సు చేసినా, ఎంత ధ్యానము చేసినా, ఎంత యోగము చేసినా ప్రయోజనం లేదు. ఈనాటి మానవుడు చేసే సాధనలన్నీ కృత్రిమంగా ఉన్నాయి. జపము, తపము, ధ్యానము, యోగము ఇవన్నీ కేవలం తాత్కాలికమైన తృప్తిని అందిస్తాయేగాని, శాశ్వతమైన ఆనందాన్ని చేకూర్చవు. కొందరు ధ్యానం చేస్తున్నామంటారు. సిద్ధార్థుడు కూడా చెప్పాడు, ధ్యానం చేయండని. అయితే, దేనిని ధ్యానం చేయడం? అసలు ధ్యానమంటే ఏమిటి? ఒక వస్తువుపై మనసును కేంద్రీకరించడమా? కాదు, కాదు, ఇది ధ్యానమే కాదు. 'నేను నేనే' అనుకోవడమే నిజమైన ధ్యానము.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహం ఆత్మనివేదనం**

స్నేహమనగా ఏమిటి? ఇరువురును ఒక్కటి కావడం. స్నేహము తరువాత ఆత్మనివేదనము. అదొక్కటి మాత్రమే దైవానికి సమీపంగా చేర్చుతుంది. 'నీవు', 'నేను' అనే భేదమున్నంతవరకు ఇది సాధ్యం కాదు. బుద్ధుడు ఈవిధమైన సత్యాన్ని గుర్తించి వర్తిస్తూ వచ్చాడు. తాను అనేకమంది యోగులను ఆశ్రయించి వారు బోధించినట్లు అనేక మార్గములలో జపములు, తపములు చేస్తూ వచ్చాడు. అయితే, ఇవన్నీ కేవలం

కాలహరణము గావించునవేగాని, కాంతినందించునవి కావని గుర్తించాడు. కాలమును వ్యర్థం చేయకుండా సార్థకము గావించుకోవడమే మానవుని ప్రధాన కర్తవ్యమని తాను భావించాడు.

**'నీవు', 'నేను' అనేవి ఏకం కావాలి**

ప్రేమస్వరూపులారా! మీరందరూ అనేక సాధనలు చేస్తున్నారు. జపతపములు చేస్తున్నారు; ధ్యానానికి కూర్చుంటున్నారు. ఈవిధంగా కాలమును వ్యర్థం చేసే బదులు సమాజసేవ చేయండి. మానవునిలో ఉన్న దైవత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించండి. అదే నిజమైన ధ్యానము. అంతేగాని, కన్నులు మూసుకొని 'రామ్, రామ్, రామ్, రామ్' అనుకుంటూ కూర్చోవడం ధ్యానం కాదు. నాలుక 'రామా' అంటుండాదిగాని, హృదయం శూన్యంగా ఉంటున్నది. ఈవిధంగా ధ్యానం చేయడం కాలాన్ని వ్యర్థం చేయడమే. ప్రతి జీవిలో ఉన్న దైవత్వాన్ని గుర్తించాలి. వ్యష్టి, సమష్టి, సృష్టి, పరమేష్ఠి – ఈ నాల్గింటి మధ్యగల సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని గుర్తించాలి. పరమేష్ఠినుండి సృష్టి వచ్చింది. ఆ పరమేష్ఠియే ఆత్మ. ఆత్మ సర్వుల యందున్నది. ఇది సర్వాంతర్యామి. సృష్టిలో 'నీవు', 'నేను' అనే రెండు తత్త్వము లేర్పడుతున్నాయి. ఈ రెండూ ఏకం కావాలి. సృష్టిలో ఏకత్వాన్ని దర్శించాలి. వ్యష్టి సమష్టిని సేవించినప్పుడు పరమేష్ఠిని పొందవచ్చును. పరమేష్ఠియే పరబ్రహ్మతత్త్వము. ఇదియే సృష్టికి మూలాధారము. ప్రతి మానవుడు కూడను, 'నేను పరమేష్ఠిని, నేను పరమేష్ఠిని, నేను పరమేష్ఠిని', అని పదే పదే భావిస్తూ ఉండాలి. నీలో ఉన్నది ఎవరు? ఆత్మస్వరూపుడు. ప్రతి మానవుడు ఆత్మతత్త్వముచేతనే జీవిస్తున్నాడు. అట్టి ఏకాత్మస్వరూపాన్ని దర్శించినటువంటి వాడు బుద్ధుడు. ఏకాత్మను దర్శించిన తరువాతనే అతనిలో సంపూర్ణంగా మార్పు వచ్చింది. తల్లి, తండ్రి, భార్య, బిడ్డ మొదలైన ప్రాపంచికమైన సంబంధ బాంధవ్యాలను అతను మరచినాడు. తన దేహమునుకూడా తాను మరచినాడు. అందువల్లనే అతనికి 'బుద్ధుడు' అని పేరు వచ్చింది.

**మానవాళికి బుద్ధుని సందేశం**

sri sathyasai vachanamrutam

బుద్ధి అనగా ఆలోచనాశక్తికి సంబంధించినదని మీరనుకుంటున్నారు. కాదు, కాదు. అది కేవలం ప్రాపంచికమైనటువంటి బుద్ధి. మనము కోరవలసింది ఆధ్యాత్మిక బుద్ధి. ప్రాపంచికమైన బుద్ధి అనేకత్వమును చూపిస్తుంది, ఆధ్యాత్మిక బుద్ధి ఏకత్వమును దర్శింపజేస్తుంది. అనేకత్వములోని ఏకత్వమే ఆత్మతత్త్వము. ఇట్టి ఏకత్వాన్ని దర్శించినటువంటివాడు బుద్ధుడు. బుద్ధునికి సమకాలీనులైన అనేకమంది మహనీయులు కూడా చెపుతూ వచ్చారు, తమకు తెలియని సత్యాన్ని బుద్ధుడు తెలుసుకున్నాడని.

'బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి.'

జగత్తంతటా నిండియున్నది ఒకే తత్త్వమని, బుద్ధిని ఆధారం చేసికొని విచారించినప్పుడు ఈ జగత్తులో ఆత్మతత్త్వము తప్ప అన్యమంతా శూన్యమే అనే సత్యాన్ని గుర్తించవచ్చునని బుద్ధుడు ప్రబోధించాడు.

ప్రతి మానవునియందు సత్యనిత్యమైనటువంటిది ఒకటుంది. అదే దైవత్వము. 'సత్యం శరణం గచ్ఛామి'. 'ఏకం శరణం గచ్ఛామి'. అంతా భగవంతునియొక్క తత్త్వమే. రెండవ పదార్థమే లేదు, ఈ జగత్తులో. 'మేము ఇంతమందిమి ఈ హాలులో సమావేశమైనాము' అని మీరనుకుంటారు. కాదు, కాదు. మీరందరూ చేరి ఒక్కటే. చూడండి, ఇక్కడ బల్బులన్నీ వేరువేరుగా ఉన్నాయి. కాని, కరెంటు ఒక్కటే. అట్లే, మీ రూపనామములు వేరువేరుగా ఉండినప్పటికిని అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే. అదియే నిజమైన శక్తి. ఆ శక్తి ఒక్కటి గనుక జారిపోయిందంటే అన్ని 'బల్బులూ' కాంతిహీనమవుతాయి. సర్వము భగవంతునియొక్క అధీనంలోనే ఉన్నది. ఇట్టి సత్యాన్ని బోధిస్తూ బుద్ధుడు తన శిష్యులతోకూడి గ్రామగ్రామాల్లో పర్యటిస్తూ వచ్చాడు. అందరికీ ఈ సత్యాన్ని బోధించాలన్నది అతని ఆకాంక్ష. తనకు విశ్రాంతి కావాలని ఏమాత్రం ఆశించలేదు. 'నేను తెలుసుకున్న సత్యాన్ని ప్రజలకు బోధించాలి. నా కర్తవ్యమిది', అని భావించాడు. తండ్రియైన శుద్ధోధనుడుకూడా ఆసమయంలో వచ్చి బుద్ధుని బోధనలను విని, సత్యాన్ని గుర్తించి తనలో మార్పు తెచ్చుకున్నాడు. బుద్ధుడు ప్రధానంగా బోధించినదేమిటి? అందరియందున్నటువంటి ఆత్మ

sri sathyasaivachanamrutam

తత్త్వము ఒక్కటే, ఒక్కటే! 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'. భగవద్గీతలో కృష్ణుడుకూడా చెప్పాడు, 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః', 'నా అంశమే సర్వులయందు ఉంటున్నది. నీలో ఉన్నటువంటిది నా ప్రతిబింబమేగాని మరొకటి కాదు.' ఈ సత్యాన్ని గుర్తించే నిమిత్తమై బుద్ధుడు ఎంతో శ్రమ పడ్డాడు. తాను ధరించిన కాషాయ వస్త్రాలకు తగినట్లుగా సర్వ ఆశలను త్యజించాడు. అతనిలో ఒక్క ప్రేమ తప్ప మరొకటి లేదు. ప్రేమయే తన ప్రాణమని భావించాడు. ప్రేమ లేకపోతే అంతా శూన్యమే అని బోధించాడు.

**ఉన్నది ఒక్కటే, పేర్లు అనేకం**

మీరు ఒకరికొకరు నమస్కారము చేసుకున్నప్పుడు, 'నేను ఎదుటి వ్యక్తికి నమస్కారము చేస్తున్నాను' అని భావించరాదు. 'నాకు నేనే నమస్కరించుకుంటున్నాను. నా ప్రతిబింబాన్నే నేను చూసుకుంటున్నాను', అని భావించాలి. 'అది నేనే.' 'అహం బ్రహ్మాస్మి' అనే మహావాక్యం బోధిస్తున్నది ఇదే. రూపనామములు వేరువేరుగా ఉండవచ్చును. కాని, అన్నింటియందు ఉన్న దివ్యత్వం మాత్రం ఒక్కటే. దీనిని మనము 'కర్చీఫ్' అంటాము. దీనిని 'అంగీ' అంటాము. పేర్లు వేర్వేరుగాని, ఈ రెండింటికీ ఆధారము ప్రత్తియే కదా! అదేరీతిగా, అన్ని రూపనామాలలోనూ అంతర్లీనంగా ఉన్న భగవత్తత్త్వము ఒక్కటే. కాబట్టి, భగవత్తత్త్వము ఏకత్వంగా భావించవలసిందేగాని, అనేకత్వముగా విశ్వసించవలసింది కాదు. ఈనాడు గొప్ప పండితులు కూడను భిన్నత్వాన్నే బోధిస్తున్నారు. తాము వేద శాస్త్రాలలో గొప్ప పాండిత్యాన్ని గడించామని భావించి వాటిలో ఉన్న విషయాలను తమకు తోచినరీతిగా బోధిస్తున్నారు. ఉన్నది ఒక్కటే. దానికి అనేక పేర్లు పెడుతున్నారు. అందరియందున్న నిర్మల, నిశ్చల, నిస్స్వార్థమైన ఆత్మతత్త్వము ఒక్కటే. కాబట్టి, మనము ఎవరినీ నిందించకూడదు, ఎవరినీ దండించకూడదు. ఎవరిలోనూ తప్పులు వెతుకకూడదు. బుద్ధుడు బోధించినది ఇదే! బీదలను ఆదరించండి, వారికి సహాయం చేయండి. అసలు ఈ లోకంలో ఎవ్వరూ బీదవారు కారు. అందరూ ఐశ్వర్యవంతులే. All are rich. Nobody is poor. తినడానికి తిండి లేనంత మాత్రమున, చేతుల్లో కాసులు లేనంతమాత్రమున ఎవ్వరినీ మనము బీదవారని భావించి చులకన చేయకూడదు. కాసులు లేకపోవచ్చునుగాని, హృదయం ఉంది కదా! కాబట్టి, అందరినీ గౌరవించాలి.



srisathyasaivachanamrutam

## తేదీ 13.05.2006, బుద్ధపూర్ణిమ, బృందావనం

**మీరందరూ బుద్ధులే!**

'వీరు నావారు, వారు పరాయివారు, ఇతను మిత్రుడు, అతను శత్రువు', అని భావించుకోకూడదు. All are one, be alike to everyone. అందరూ ఒక్కటే. అందరిపట్ల సమభావంతో వర్తించాలి. ఇదే మన ప్రధానమైన కర్తవ్యం అని బోధించాడు, బుద్ధుడు. కాని, దీనిని ఈనాడు ఎవ్వరూ ఆచరించడం లేదు. బుద్ధునియొక్క చరిత్రను మాత్రమే గొప్పగా వర్ణిస్తూ వస్తున్నారుగాని, అతని హృదయ తత్త్వాన్ని ఎవ్వరూ విచారించడం లేదు. నిజానికి, బుద్ధుడు ఒక్కడు కాదు; మీరందరూ బుద్ధులే! ఇట్టి సత్యాన్ని మీరు గుర్తించుకున్నప్పుడు మీ అందరియందుకూడను ఏకత్వము బయలుదేరుతుంది. Unity in divinity. డివినిటీలో యూనిటీ ఉంది. అనేకత్వంలో ఏకత్వం ఉంది. బాహ్య దృష్టికి అనేకత్వం కనిపిస్తుందిగాని, ఉన్నది ఏకత్వమే. అద్దాలగదిలో ప్రవేశించిన మనిషికి చుట్టూ తన ప్రతిబింబాలు అనేకం కనిపిస్తాయి. ప్రతిబింబాలు వేరువేరుగాని, బింబము ఒక్కటే కదా! ఇక్కడ నేను ఒక్కడినే మాట్లాడుతున్నాను. కాని, ప్రతి ఒక్క స్పీకర్‌దగ్గర మీకు నా మాటలు వినిపిస్తున్నాయి. అట్లే 'రిఫ్లెక్షన్', 'రియాక్షన్', 'రీసౌండ్'లు వేర్వేరుగాని, 'రియాలిటీ' ఒక్కటే. కాబట్టి, అందరియందున్న హృదయాలను ఏకత్వం చేయాలి. మనసులో ఏకత్వ భావన కలిగినప్పుడే మనుష్యత్వం సార్థకమవుతుంది. మనసులో ఏకత్వం లేకుండా మనుష్యులు మాత్రం ఏకంగా ఉంటుంటే, దానివల్ల ప్రయోజనం లేదు. "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" బంధమోక్షములకు మనసే కారణం. ఒకరిని చూస్తే మంచిగా అనిపిస్తుంది, మరొకరిని చూస్తే చెడ్డగా అనిపిస్తుంది. అయితే, ఈ మంచిచెడ్డలు నీ మనసులో ఉన్నవేగాని, ఎదుటి మనిషిలో ఉన్నవి కావు. 'ఇది తెల్లని బట్ట' అంటాము. 'ఇది నల్లని మైకు' అంటాము. ఈ నలుపు, తెలుపులు మన కంటియొక్క దృష్టికి వేరువేరుగా గోచరిస్తున్నాయిగాని, రెండూ చేరి ఒకటే. భిన్నత్వములో ఏకత్వమున్నదనే సత్యాన్ని ప్రతి మానవుడు గుర్తించాలి.

**మన ప్రేమను ప్రతి ఒక్కరికీ పంచాలి**

బుద్ధత్వములో ఎంతయో గొప్పతనముంటుండాది. కాని, ఆ గొప్పతనాన్ని ఎవరూ అర్థం చేసుకోవడం లేదు. మీరు గమనించారో లేదో... బుద్ధుని శిరస్సుపై వెంట్రుకలు



sri sathyasai vahini amrutam

రింగులురింగులుగా ఉంటాయి. అన్నీ ఒకదానితో ఒకటి చుట్టుకొని ఉంటాయి. అదేవిధంగా, ఒకరితో ఒకరు కలసిమెలసి ఉండడమే ఉత్తమం. బుద్ధుని హృదయం నిండుగా ఉన్నది ఒకే భావము. అదే ప్రేమతత్త్వము. 'ధర్మం శరణం గచ్ఛామి' అంటే ఏమిటి? ధర్మమును మనము ఆశ్రయించాలి. 'ప్రేమం శరణం గచ్ఛామి'. ప్రేమతత్త్వమును ఆశ్రయించాలి. ప్రేమ లేనప్పుడు మానవత్వమే లేదు. కనుక, మన ప్రేమను ప్రతి ఒక్కరికీ పంచాలి. భిక్షగాడు, షావుకారు అనే భేదము లేకుండా అందరినీ ప్రేమించాలి. డబ్బును చూసి ప్రేమించకూడదు. డబ్బు ప్రధానం కాదు. Money comes and goes, morality comes and grows (డబ్బు వస్తుంది పోతుంది; నైతికశక్తి వస్తుంది, అభివృద్ధి చెందుతుంది). కాబట్టి, మనసును పవిత్రంగా ఉంచుకోండి. ఎవ్వరినీ మనము బాధించకూడదు. Help ever, hurt never. అందరికీ సహాయం చేయాలి. అటువంటివాడే బుద్ధుని స్థాయికి వస్తాడు. మనము వేదికపై నిలబడి గొప్పగా ఉపన్యాసాలిస్తే ప్రయోజనం లేదు; బోధించే విషయాలను స్వయంగా ఆచరణలో నిరూపించాలి. దైవత్వాన్ని ఏకత్వంగా భావించుకొని ఆనందంగా ఆరాధన చేస్తూ రావాలి. 'రామా', 'కృష్ణా', 'బుద్ధా', 'స్వామీ' అని ఏ పేరుతోనైనా దైవాన్ని పిలువవచ్చు. అందరియందున్న దివ్యత్వము ఒక్కటే. ఏకత్వమనే పుష్పాన్ని హృదయంలో పెట్టుకొని దాని పరిమళాన్ని అందరికీ అందిస్తూ రావాలి.

**మనసును ఏకత్వంపై స్థిరంగా నిల్పుకోవాలి**

ఏకత్వం లేకుండా ఎన్ని జపములు చేసినా, ఎన్ని తపములు చేసినా ప్రయోజనం లేదు. చాలామంది చేతిలో జపమాల పట్టుకొని త్రిప్పుతుంటారు. కాని, జపమాలను ఎంతగా త్రిప్పుతుంటారో వారి మనసు కూడా అంతగా తిరుగుతూ ఉంటుంది. మాలతోపాటు మైండుకూడా తిరుగుతూ ఉంటే ప్రయోజన మేమిటి? మనసును స్థిరంగా పెట్టుకోవాలి. స్థిరత్వం, ఏకత్వం రెండూ ఉండాలి. అప్పుడే మానవజన్మ సార్థక మవుతుంది.

మీకు తెలుసు – ఏదైనా ఒక లారీ చెత్తదిబ్బ నింపుకొని పోతూ ఉంటే దానిపై అనేక ఈగలు ముసురుతుంటాయి. ఆ లారీ ఎక్కడైనా లడ్డూ అంగడి ఎదురుగా ఆగినప్పుడు ఆ

srisathyasaivaachanamrutam

ఈగలు అంగడిలో ఉన్న లడ్డూలపైకూడా వ్రాలుతుంటాయి. అదేవిధంగా, మీ మనస్సు కొద్దిసేపు ఏకత్వంపై, మరికొంతసేపు అనేకత్వంపై తిరుగుతూ ఉంటే ఏమి ప్రయోజనం! మనసును ఒకసారి మంచిపైన, మరొకసారి చెడుపైన ప్రసరింపజేయకూడదు. ఒక్క మంచిపైన మాత్రమే మనసును స్థిరంగా నిల్పుకోవాలి. ఒకసారి దీనిపైన, మరోసారి దానిపైన తిరుగుతూ ఉండకూడదు. మంచి కనిపించిందా, దానిపైనే మనసు నిల్పుకోవాలి. అట్టి రాజమార్గమును అనుసరించినప్పుడే మనము సత్యాన్ని గుర్తించగలము. రాజమార్గమును వదలిపెట్టి మీరు వంకరటింకర రోడ్డును పట్టుకుని పోతుంటే అది మిమ్మల్ని చెత్తదిబ్బలపైకి, మురికిగుంటలలోకి, ఇంకా ఎక్కడెక్కడికో తీసుకుపోతుంది.

**బుద్ధపూర్ణిమ విశిష్టత**

ప్రేమస్వరూపులారా! అందరియందున్న ప్రేమ ఒక్కటే. ప్రేమస్వరూపులై జన్మించిన మీరు ప్రేమమార్గంలోనే ప్రయాణించండి. ఆవిధంగా ప్రేమ మార్గంలో పయనించినవాడే బుద్ధుడు. అతను కేవలం ప్రజల శ్రేయస్సుకోసం పాటుపడ్డాడే తప్ప పేరు ప్రఖ్యాతులను ఏనాడూ ఆశించలేదు. ఈనాడు మనం బుద్ధపూర్ణిమ పండుగను జరుపుకుంటున్నాము. పూర్ణిమ అంటే full moon. కాబట్టి, మన మనసులో ఏవిధమైన దోషాలూ లేకుండా ఉండాలి. అంతేకాదు. మనసు ఎక్కడినుండి ప్రారంభమైందో తిరిగి అక్కడికే పోయి అంత్యం కావాలి. అదే పూర్ణిమ. ఆ పూర్ణిమలో ఏవిధమైన చీకటీ ఉండదు. అట్టి పవిత్రతను మనం పొందాలి.

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ప్రేమస్వరూపులారా! ఈనాడు మీరందరూ ఇక్కడ చేరడం ఎంతో ఆనందంగా ఉన్నది. మీ అందరి మధ్య ఉన్న అనుబంధము ప్రేమయే! మీయందున్న ప్రేమ, నాయందున్న ప్రేమ, అందరియందున్న ప్రేమ ఒక్కటియే. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించండి. ప్రేమలో జీవించండి.

(తేదీ 13.05.2006, బుద్ధపూర్ణిమ, బృందావనం)

sri sathyasai vachanamrutam